

# వేళ

మంధా నరసింహారెడ్డి

సూర్యుడు తూర్పున ఉదయించలేదు యింకా.

రకరకారల పక్షులు నిద్రలేచి సుప్రభాతం పాడుతున్నాయి.

పక్షుల ప్రభాత గీతాలకు ప్రాతఃకాలపు ప్రకృతి వింతగావుంది.

పొద్దస్తమానం ఒళ్ళు హూనమయ్యేలా చాకిరీచేసిన వెంకటేశానికి, పక్షుల మేలుకొలుపుకు లేవబుద్ధికాలేదు చింకిచాపమీదనుంచి. అయినా తప్పదన్నట్టు బద్ధకంగా లేచి ఒళ్ళు విరుచుకున్నాడు. సగం కాలిపోయిన ఎంగిలి బీడీముక్కను చెవి సందులోంచి తీసి నోట్లో కుక్కుకున్నాడు అయిష్టంగా. జేబులోంచి అగ్గిపెట్టె తీసి బీడీ ముక్క వెలిగించాడు. రెండు దమ్ములు లాగేసరికి వెంకటేశం ఒంట్లో నిద్రమత్తు విచ్చుకుంది. చేతివేళ్ళు చురుక్కుమనే దాక పీల్చి, పూర్తిగా కాలిపోయిన బీడీ ముక్కను విసిరేస్తూ, పేడతట్ట తీసుకుని

పశువుల పాకవైపు కదిలాడు వెంకటేశం.

చేతులు పేడ ముద్దమీద పడీ పడక ముందే "జుయ్" మన్నాయి దోమలు. వెంకటేశానికి చెప్పలేనంత రోత కలిగింది. పశువుల మలమూత్రాలతో చిన్న సైజు బురద గుంటల్లా తయారైన పశువులపాక - మున్సిపాలిటీ మురికి కాల్వలపై స్వైరవిహారం చేసే ప్రజా దోమల్ని మరిపించేయి చక్రవర్తి దోమలు కొత్తకాదు వెంకటేశానికి.

సంవత్సరమూ రెండు సంవత్సరాలూ కాదు. పన్నెండు సంవత్సరాల నుంచి పనిచేస్తున్నాడు 'దొర' దగ్గర. యిన్నేళ్ళనుంచి నిజాయితీకి మారు పేరుగా పనిచేస్తున్న వెంకటేశానికి, ప్రభుత్వోగికి వచ్చే ప్రమోషన్ లాంటిదేదీ రాలేదు - రాదు.

పైగా దొర ఇంట్లోంచి, రేడియోలో "....గ్రామంలో భూస్వాముల దగ్గర ఐదేండ్లుగా వెట్టిచాకిరి చేస్తున్న తొమ్మిది మందికి విముక్తి కలిపించారు. ... వారు వెట్టిచాకిరి రద్దుచేయటంవలన ఇంత వరకు... మంది విముక్తి పొందారు..." అని చిలుకపలుకులు విన్పించే 'దొర రేడియో' అంటే కోపం - ఇంతకు ముందు ఒకటి రెండుసార్లు విన్నదే విని విసుక్కున్నాడు. "ఉన్న రెండెకరాల భూమి నా పెళ్ళికి, చెల్లెలు పెళ్ళికి (దొర) హరించుకపోయే! 'దొరలాంటి' వారి దగ్గర పన్జేసే 'నాలాంటి' వారికి 'వెట్టిచాకిరి రద్దు' అనే గోలొకటి" అని విసుక్కునేవాడు 'ఆ' ప్రస్తావన విన్నపుడల్లా.

గేటు చప్పుడవడంతో పాక ఊడుస్తూనే తలెత్తిచూశాడు.

"తొరగా పాలుపిండుకు రమ్మన్నాడు దొర. వూరికెళ్తాడట!" వెంకటేశం అడక్కముందే వచ్చిన విషయం చెప్పింది నాగమ్మ.

"తొరగా!తొరగా! .. నే మనిసినే... నాకేటి నాల్గు సేతులున్నాయేంటి? నువ్వెళ్ళు! పిండుకొస్తానుగాని."

దొరమీది కోపం భార్య మీద చూపాడు.

పదేళ్ళగా కలసి కాపురం చేస్తున్న నాగమ్మకు భర్తమనస్సు తెలుసు. అందుకనే మారు మాట్లాడకుండ, పాలు పిండేందుకు తెచ్చిన చెంబు యిచ్చి వెళ్ళింది.

నాగమ్మను దొర ఇంట్లో పనికి పెట్టడం యిష్టంలేదు. కాని పరిస్థితులు... నాగమ్మకూడ పనిచేయకపోతే పైసా పని చేయలేని తన తల్లిదండ్రులు ఆకలి మంటల్లో దహించుకుపోతారని రోజులు బెదిరించాయి. నీలాగే బండ చాకిరీ చేయాల్సిన గతి నీ పిల్లలకు పట్టనీయకని భవిష్యత్ కాలం, వెంకటేశాన్ని హెచ్చరించింది.

తప్పనిసరిగా నాగమ్మకు దొర ఇంట్లో పనిచేయవలసిన అగత్యం పట్టింది

* * *

"ఎం(త్రోయ్. వూరి కెళ్ళాల్సిన పనుందని చెప్పలేదురా నీ పెళ్ళాం? ఎప్పుడు ఓ మాదిరిగానే పన్జేస్తె ఎట్టా గరా. సమయానుకులంగా పన్జేయటం నేర్చుకో. ఈ మద్దెన సుఖం మరగటం నేర్చావుగదరా!" పాలు తీసుకొని గేట్ దాటి వస్తున్న - వెంకటేశాన్ని, వా(క్ర హంతో ఉక్కిరి బిక్కిరి చేశాడు దొర.

వెంకటేశం మౌనం దొరను రెచ్చ గొట్టింది.

"మాట్టడవేంది నాలముచ్చునాయాలా! తిండికి పెద్దకొడుకువి - పనికి దొంగ కొడుకువి."

"మరేంలేదూ(.... వంట్లో కాస్త నలతగా వుంటేనూ...."

"ముండనాయాలా! వంట్లో నలతగా వుందేటి? నడుం విరిగేలా మెక్కితె మరట్టాగే వుంటుంది. ఓపూట తిండి తగ్గించెయ్ బాగుంటుంది." వెంకటేశం జవాబుకు ఉరిమాడు దొర.

"సుబ్బిగాణ్ణి పన్లోంచి తీసేసారుగా.. వాడిపని కూడా నేనే చేయాల్సొస్తుంది. ఇద్దరు చేసే పని నే నొక్కన్నే చేయ లేకపోతున్నా...." అసలు విషయం మెల్లగా బయటపెట్టాడు వెంకటేశం.

"చెప్పొచ్చావులేవోయ్! ఆ దొంగ వెదవ తప్పుడు పన్లు చేశాడు బయటికి గెంటాం నీతోనే పన్లు మొత్తం చేయించుకోవాలని, వాణ్ణి పన్లోంచి తీసెయ్యలేదు. అడెలా వేసాలేసినా పన్లే దంటావా మాకు? నా(ల్రోజులాగు... లేకుంటే నీ పిల్లల్ని తోడుతెచ్చుకో" ఈసారి కాస్త నెమ్మదిగానే అరిచాడు.


ముక్కుపచ్చలారని పసిపిల్లల్ని తనతో చాకిరీ చేసెందుకు తోడు తెచ్చుకో అన్న దొర సలహాకు, మారు మాట్లాడ బుద్ధి కాలేదు వెంకటేశానికి.

"నుంచున్నావేరా ...." అప్పటికి ముగింపు పలికాడు దొర.

బరువుగా శ్వాస పీలుస్తూ కదిలా డక్కడినుండి.

"ఓసి దొంగముండా! బంగారంలాంటి పట్టుచీర బండకు బాది పాడుచేశావుగదే. అసలు నిన్ను యీ చీర ఉతకమన్నది ఎందుకే?.... ఖరీదైన చీర సాకలికేస్తె పాడుచేస్తాడనేగా. దొంగముండ! చినిగిన పాతచీరలు నీకే యిస్తున్నామని, యీ పట్టుచీర కూడా పాడుచేస్తావా? నీ వగలాడితనం నా దగ్గర చూపిస్తావటే... వందా రెండొందల చీరనుకున్నావా? నీ జన్మలో రెండువేల రూపాయల ఖరీదైన చీర తాకిచూశావే?"

దొరసాని రంకెలతోపాటు విన్పి స్తున్న దెబ్బల చప్పుడు విని, కంగారుగా నూతివైపు వెళ్ళాడు వెంకటేశం.




జుట్టంతా చిందరవందరయి, చేతి గాజులు పగిలి రక్తం కారుతున్న నాగమ్మను చూచిన వెంకటేశం కళ్ళల్లో నీళ్ళు కారాయి.

"యిట్టాంటోళ్ళ దగ్గర నువ్వు పన్జెయ్యలేవని ఆ రోజే చెప్పా...." అంతకుమించి మాట్లాడలేకపోయాడు.

"మన బతుకులో యిట్టాంటివి ఎన్నో ఎదురవుతాయి-అవుతుంటాయి. అయినా మనకీ కష్టాలు తప్పవు. ఎవరికోసం? మన పిల్లలు మనలా కుక్కబతుకులు బతక్కుండా వుంటానికి. దొరసాని యిలా ఎన్నోసార్లు సావబాదింది. యియ్యాల నువ్వు సూసి బాధపడ్తున్నావు; నువ్వు సూసీసూడనట్టు పెసులుకో మనకు, మంచిది మన పిల్లలకు మంచిది" అంది నాగమ్మ భర్త కన్నీళ్ళుచీర చెంగుతో తుడుస్తూ.

అరటిపండు తొక్క ఒలిచి చేతిలో పెట్టినట్టు మాట్లాడిన నాగమ్మకు, మరేం చెప్పాలో బోధపడలేదు వెంకటేశానికి.

"రేయ్ ఎంకటేశం!"

దొర రౌద్రకంఠానికి ఉలిక్కిపడి నాగమ్మ కళ్ళల్లోకి దీనంగా చూస్తూ అక్కడినుండి కదిలాడు వెంకటేశం.

"ఎన్నిసార్లు పిలిచినా, పలకవేట్రా! చెవుడొచ్చేసిందేటి. ప్రెసిడెంటుగారింటి కెళ్ళి బండెడ్లు పట్రా పో." స్నానానికి కదులుతూ ఆదేశాలు జారీచేశాడు.

"మన ఎడ్లున్నాయిగా...."

మెడపట్టి లాగినట్టు ఆగిపోయాడు దొర

"ఏడిశావు లేవోయ్! నువ్వూ నీ తెల్వినూ.... వారం రోజుల్నుంచి బండి లాగి అలిసున్నాయి అవి. నీకు మల్లే వాటివి పాణాలే!" ఇక చెప్పాల్సిందేమి లేనట్టు కదిలాడు లుంగీ సర్దుకుంటూ.

దొర (అతి) తెలివికి వళ్ళు మండి పోయింది వెంకటేశానికి.

ఇనుపగేటు విసురుగా లాగి, దొర మీది కసి అంతా దానిమీద చూపి ప్రెసిడెంట్ రంగనాథం ఇంటివైపు కదిలాడు.

రంగనాథానికి మొదట్లో అంటే పదేళ్ళ క్రితం ఓ యిల్లు తప్ప మరేమీ లేదు. ఇంకా 'జులాయి' మాటకారితనం తప్ప. ఇప్పుడు యాభై ఎకరాల భూమి, రెండు మేడలు, ప్రెసిడెంట్ 'గిరీ' వగైరాలున్నాయి.

రంగనాథం 'అంతటివాడు' 'ఇంతటివాడు' అయ్యేందుకు కారకుడు దొరే. దొర దీవూరుకాదు – ఏ వూరో ఎవరికీ తెలియదు. ఇక్కడి కొచ్చేటపుడు అంటే ఇరవైఏళ్ళ క్రితం లక్ష రూపాయల రొక్కం (వున్నఊళ్ళో బ్రతకలేక ఉన్న భూములన్నీ అమ్ముకుని) తెచ్చాడట. రంగనాథం పుట్టీ పెరిగిందీ వూళ్ళోనే. పైగా 'మాటకారి' అ(దుర)దృష్టవశాత్తు రంగనాథానికి దొర, దొరకు రంగనాథం తటస్థపడటం జరిగింది. ఇద్దరి బుద్ధులు, ఆలోచనలు ఒకేలా వుండటంతో జోడు కుదిరింది.

లక్ష రూపాయలతో సగానికి సగం చవకరేటులో దొరకు, ఓ యాభై ఎకరాల భూమి కొనిచ్చాడు రంగనాథం తన (అతి) తెలివితేటలతో. ఆయన తెలివికి మెచ్చి ఐదెకరాల భూమిని ప్రతిఫలంగా యిచ్చాడు దొర. దాంతో దొర యిచ్చిన ఐదెకరాల భూమిని యాభై ఎకరాలుగా మార్చుకుని, దొర సహకారంతో వరసగా మూడుసార్లు ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యాడు.

రంగనాథం ప్రెసిడెంట్ అయ్యాక దొర నలభైఐదెకరాల భూమి నూటాయాభై ఎకరాలుగా మారింది. ఇక ఆయనకు భూములమ్ముకున్న పేదజనంతోసహా ఊరిజనం అంతా, ఆయన అసలు పేరేంటో మరుగున పడేసి "దొరా" అని ముద్దుగా పిలవటం నేర్చుకున్నారు.

ఈయన 'దొర'లా వెలిగిపోయేందుకు రంగనాథం సహకారం లేదు అనలేము–నిక్కచ్చిగా అనకూడదు. తను ప్రెసిడెంట్ అయ్యాక తన్నింతవాణ్ణి చేసిన దొర కీమాత్రం సహకారమైన అందించకుంటె, జనం దృష్టి(?)లో "విశ్వాస హీనుడు"గా తయారవటం ఇష్టమనిపించ లేదు రంగనాథానికి. అందుకనే దొర నలభైఐదెకరాల భూమి నూటాయాభై ఎకరాలుగా వృద్ధి చెందెందుకు "ఎలాగో అలాగ" "తనశక్తి" కొద్ది సహకారమందించాడు.

ఇరువైఏళ్ళ నుంచి ఒకరికొకరు

సహాయసహకారా లందించుకుంటూ, క్రమం తప్పకుండ రంగనాధమే ప్రెసిడెంట్ అయ్యాక వూరు బాగుపడి(?)ందనుకోవడంలో పొరపాటేమీలేదు.

దొర రంగనాధంలతో సహా వూళ్ళో చదువుకున్న జనం ఎవరూ లేరు ఒకప్పుడు. మరిప్పుడేమో దొర ఐదుగురు సంతానం, ముచ్చట గొలిపే రంగనాధం ముగ్గురు కొడుకులు పట్టణాలలో చదువుకోవటమే, వూరు బాగుపడుతుందనే దానికి చక్కని నిదర్శనంగా భ్రమసినా, అందులో వాళ్ళ తప్పేంలేదు.

తామున్నంత కాలం 'తమ తరం' ఉన్నంతకాలం తమ పేరు ప్రతిష్టలకే లోటు రాదని దొర, రంగనాధంల గట్టి నమ్మకం(?).

* *

"మీ దొర ఎంజేస్తున్నాడ్రా ఎంకటేశం?" నెమ్మదిగా అడిగాడు రంగనాధం.

"నే వచ్చేఁపుడు సాఁనం జేస్తున్నాడండీ" చెప్పేడు.

"బండెడ్లు ఎందుకురా? పొలంకాడికెళ్తున్నాడా మీ దొర?" కుతూహలంగా అడిగాడు రంగనాధం.

"నేఁదండి. ఊఁరికెళ్తున్నాడు. బస్సుకోసం అడ్డరోడ్డు స్టేజీ దగ్గర వదిలి రావాలిగదండి మరి."

"మీ దొర బండెడ్లు ఏమయ్యాయిరా?" అని రంగనాధం అడగనందుకు సంతోషించాడు వెంకటేశం.

"సరే! తోలుకెల్లుగానీ, ఎండలో రానుపోను పదిమైళ్ళు ఎల్లొచ్చేసరికి ఎడ్లు అల్సిపోతాయి కదా! ఎడ్లకు కాస్త పచ్చిగడ్డి తినిపించు. ఇఁగో...." అంటూ జేబులోంచి రూపాయినోటు తీసి అందించాడు రంగనాధం.

"అచ్చే.... నాకెందుకండీ" మోహమాటం కొద్ది అంటూనే, చొక్కా జేబులో రూపాయి నోటును మహానందంగా కుక్కుకున్నాడు వెంకటేశం.

వెంకటేశం (దొరకు) చేసే గొడ్డు చాకిరీ గుర్తించాడు. అందుకనే ఓసారి "నువ్వు నా దగ్గర పన్జేస్తావురా? దొర యిచ్చేదానికంటె ఎక్కువే యిత్తానులే" అన్నాడు రంగనాధం.

ఏం జవాబు చెప్పాలో తోచక ఇబ్బందిపడ్డాడు వెంకటేశం. చివరికెలాగో తేరుకుని "పన్నేండేళ్ళ నుంచీ దొర దగ్గర పన్జేస్తున్నాను. అప్పట్నుంచీ, ఆయన ఉప్పే తింటున్నాను — ఆయన బట్టే కడ్తున్నాను.... వేరే వాళ్ళ దగ్గర పన్జేయ్యాలంటే మనసొప్పదండి మరి. 'నువ్వు నా దగ్గర పన్జెయ్యలేవు — చెయ్యొద్దు ఎల్లిపో!' అనేంతవరకు ఏడ పన్జెయ్యను!" అంటూ తన మనోభిప్రాయాన్ని వెల్లడించాడు.

"ఓరీ పిచ్చిసన్నాసీ,.... ఉప్పు తింటున్నానంటా వేందిరా గొప్పగా! పన్జే

స్తున్నావు - తింటున్నావు. సరె! నీ మనసు కష్టపెట్టాలని లేదు నాకు" అన్నాడు రంగనాథం, వెంకటేశం జవాబు విని.

అప్పటినుంచి రంగనాథంపై ఓ రకమైన అభిమానం పెరిగింది వెంకటేశానికి. నిజానికి తనను అర్థంచేసుకుని మనసార అభిమానించటంలేదని, తన బండచాకిరీనే ఉపయోగించుకోవాలని, అభిమానపు మెరుగు పూస్తున్నాడని వెంకటేశానికి తెలియదు - అసలు వెంకటేశంలాంటి వారెవరూ రంగనాథం లాంటి వారిని అర్థంచేసుకోలేరు.

దొరసాని చేతిలో చావుదెబ్బలు తిన్న నాగమ్మ వెంకటేశం కళ్ళముందు మెదులుతూవుంటే, మెదడు ఆలోచనలతో నిండిపోయింది.

'ఎంతకాలం యిలా హీనంగా బతకాలి?! తన కుక్కబతుకు ఎన్నడు తెల్లారుతుంది. నా ఒక్కడి బతుకేనా.... నాళ్ళాంటోళ్ళు ఇంకెంతమందున్నా రీ దేశంలో?.... 'నా' అంత హీనంగా బతుకుతున్నారా?.... ఏ జనమలో చేసుకున్న పాపమో!' ఎంత ప్రయత్నించినా బుర్రలో ఆలోచల్ని పారద్రోలలేకపోయాడు.

దొర ఇల్లు సమీపించేసరికి ఆలోచనలన్నీ వాటంతటవే అయిష్టంగానే అణిగిపోయాయి.

"నీకు బుద్ధెలా వస్తుందిరా!, రంగనాథంగారితో బాతాఖానీ కొడుతూ కూచున్నావన్నమాట ఇంతసేపు" పంచె కట్టు సర్దుకుంటూ విరుచుకుపడ్డాడు.

దొరకు ఎదురు చాలసేపు వాదించదలుచుకోలేదు. ఎడ్లను నీడన కట్టివేస్తూ "మీరు తయారవ్వండి. ఈలోగా నే తినొస్తాను" అన్నాడు వెంకటేశం.

"ఏంటి తినొచ్చేది?....పొద్దునుంచేం చేశావు? ఇప్పటికే నా కాలస్యమైంది. తిరిగొచ్చి తిందువులే. తొరగా బండి కట్టు!" 'నీవెలా సస్తే నాకేం?' అన్నట్టు జరగవలసిన పని పురమాయించాడు.

నాలుగుగంటలు రానూ పోనూ ఎండలో ప్రయాణం.కడుపు ఖాళీగావుంటే ఎండలో ఏం జరుగుతుందో తెలుసు. అందుకనే నెమ్మదిగా "రాత్రినుంచేం తిన్లేదు. ఆకల్తో నీర్సంగా వుంది వంట్లో...." అన్నాడు.

తన తీక్షణమైన చూపుల్లో వెంకటేశం భస్మమైపోతే బాగుండన్నట్టు చురచురా చూశాడు దొర. అసహనంగా "జిడ్డులా పట్టుకుంటావేంట్రా. అడ్డరోడ్డు దగ్గర హోటల్లో తిందువులే. తొరగా కానియ్!" అన్నాడు.

అడ్డరోడ్డుదగ్గర పాకా హోటల్లో, దొర తినిపించే తిండి తన కడుపులో ఆకలిని, పావువంతైనా తీర్చదని తెలిసి, మరోసారి "తొరగా తినొస్తాను" అనలేకపోయాడు వెంకటేశం.

దొర గేట్ దాటాడు-కాదు బండిలో



కూర్చున్న దొరని, వెంకటేశం దాటిం చాడు – బండితొట్టిలో కూర్చుని.

ఇసుక బాట మీద బండిచక్రాలు "కర్స్....ర్స్సు....స్స్" మంటూ శబ్దించేస్తున్నాయి.

దొర భారీకాయం బండికుదుపులకు "ఉష్" మంటూ నిట్టూర్పులు విడుస్తూంది.

బండితొట్లో కూర్చున్న వెంకటేశం మనస్సు ఎండకు వేడెక్కి, బుర్రలో ఆలోచనల్ని "బుస్స్" మని ఉత్పత్తి ప్రారంభించాయి చాకిరీ జీవితంమీద.

భగవంతుడు మానవులందరిని సమానంగా సృష్టించలేదెందుకు? చావు పుట్టుకలు అందరికీ సమానమే. తల్లి కడుపులోంచి భూమ్మీద పడ్డపుడు, చచ్చిం తర్వాత మట్లో కలిసేపుడు అంతా సమానమే. మరి తను సృష్టించిన మానవ జీవితాల్లోనే మోసం, దగా, ద్వేషం, దారిద్ర్యం, బానిసత్వాలు ఎందుకు?

"ఎంగ్రటా షన్నాసి వెధవ! మూడు సార్లు పిలిచినా పలకవు! బండి నిదానంగా నడుపుతున్నావేంటి? బస్సెళ్లిపోద్ది, తరుమూ...." భుక్తాయసంతో కూడిన దొర మందలింపుకు, పేగులు మాడుతున్న వెంకటేశం ఆలోచనలు తెగిపోయాయి ఒక కొలిక్కి రాకముందే.

దొరమీది విసుగు బండెడ్ల మీద తీర్చుకున్నాడు 'చర్నకోల'తో.

"పట్" మన్న చర్నకోల చప్పుడుకు కునికిపాట్లు పడబోతున్న దొర ఉలిక్కి

పడి బెబ్బులిలా గర్జించాడు. "తొత్త నాకొడకా! నడిపితే నెమ్మదిగా నేకుంటే జోరుగా పరిగెత్తిస్తానంటావా !? కాస్త జోరు తగ్గించు"

'దొర దగ్గర పన్నెండేండ్లనుంచి పన్జేస్తె నా కొచ్చిందేంటి? ఛీ ఛీ కడుపునిండ తిండి తిన్నె దెపుడో సుఖంగా నిద్రపోవటమంటె ఏంటో ఎలోగో ఏ జన్మలో చేసుకున్న పాపవో! యీ జన్మలో ప్రెసిడెంట్ గారి దగ్గిర పన్జేస్తేపోలా దొర యిచ్చే దానికంటె ఎక్కువే యిత్తానంటున్నాడు "నాలుగురాళ్ళు' వెనకేసుకరావచ్చు కడుపునిండా తిండైనా తినొచ్చు. పని మానేస్తె, దొర ఊరుకుంటాడా ?'

"ఏట్రా ! ఎటెళ్ళుతున్నావ్ ?! - అడ్డరోడ్డు స్టేజి దాటి "

గరగరలాడే దొర కంఠానికి వెంకటేశం ఉలిక్కిపడ్డాడు-ఆలోచనలు ఆగాయి

రోడ్డుపక్క చెట్టునీడన బండి ఆపి, ఎడ్లను కట్టేశాడు సూట్ కేసు పట్టుకుని దొర దూరిన పాకా హోటల్లోకి నడిచి సూట్ కేస్ బల్లమీద పెట్టి, వినయంగా చేతులు కట్టుకు నిలబడ్డాడు వెంకటేశం

"ఎంట్రా వెంకటేశం" అని దొర అడగలేదు

"అడ్డరోడ్డు స్టేజీదగ్గర తిందువు గాన్లే" అని దొర, ఇంటిదగ్గర అన్న సంగతి మర్చిపోయాడేమోనని వెంకటేశం ఆకలి మనసు అనుమానంలో పడింది

టీ పచ్చరిస్తున్నాడు దొర

బస్సు వస్తున్న చప్పుడవుతుంది

ఖాళీ టీ గ్లాసు బల్లమీద పెట్టి లేస్తు న్నాడు బరువుగా

ఓపిగ్గా బల్లమీది సూట్ కేసు అందు కున్నాడు వెంకటేశం,

బస్సు ఇంజన్ హోరు దగ్గరవు తుంది

"నా కాకలేస్తుంది దొరా!" టీ డబ్బులు యిచ్చేందుకు దొరచేయి, జేబులోకి వెళ్ళటం చూసి భయంగా అడిగాడు వెంకటేశం

"ఓర్నీ మర్చిపోయానురోయ్, ఇంటి కెళ్ళి తినొచ్చుగా హోటల్లో ఎంత తిన్నా "కూడు" మీదికి సరిరాదు" అంటూనే వాడి జ్ఞాపకశక్తిని నిందిస్తూ రూపాయ నోటు అందించాడు

దొర బస్సెక్కాడు - వెంకటేశం ఎక్కించాడు

దుమ్ములేపుకుంటూ నిండు గర్భిణిలా కదిలింది బస్సు

తను తినదల్చుకుంటె ప్రెసిడెంట్ గారిచ్చిన రూపాయతో రెండ్రూపాయ లున్నాయి కాని వెంకటేశం ఆకల్ని బెదరగొట్టాడు - రెండ్రూపాయలతో ఓ పూట బియ్యం వస్తాయని అనుచున్నదే తడవుగా బండి కట్టాడు వెంకటేశం

బండిని అఘమేఘాలమీద తరుము కెళ్తున్నాడు వెంకటేశం-ఆకలి తరుముకు

వెళ్తుంది ఊరు దగ్గరవుతున్నకొద్దీ వెంకటేశం ఆకలి, తను తినబోయే గంజిమెతుకులకోసం జిహ్వ పురి విప్పింది

ఎడ్లు ఎండలో పరుగెత్తలేక అలిసిపోయాయి వాటి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బుస్సుమంటున్నాయి. నడక కుంటుపడింది బండిచక్రాలు నెమ్మదిగా తిరుగుతున్నాయి, అడుక్కతినేవాడి ఓపికలా బండివేగం తగ్గిన సంగతి గుర్తించేలా లేడు వెంకటేశం. అగ్నిగుండంలాంటి ఇసుకలో కాళ్ళకు చెప్పుల్లేకుండా ఏదో తెలియని ఆరాటంతో పరుగులాంటి నడక సాగిస్తున్న 'ముగ్గురి'పై చూపులు సారించాడు ఆశ్చర్యంగా

లోకజ్ఞానం గురించి పొత్తిగా తెలియని ప(డుచు)సి పిల్లా, ఈ లోకం సంగతి జీర్ణంచేసుకున్నట్టు (వయసులో) కనపడినా, ఇంకా నే నెంతో తెలుసుకోవాలన్నట్టు కనిపిస్తూవున్న ముసలమ్మ ఎండలో, నిప్పుకణికల్లాంటి ఇసుకలో నడవలేక నడుస్తున్నారు ఈ లోకం సంగతి తెలియకపోయినా, తెలుసుకోవాల్సిన ఆసక్తికూడ లేనట్టున్న కోరమీసాల పంచెకట్టు యువకుడు, కణకణమండే ఇసుకలో పాదాలు కూరుకుపోతున్నా, ఏదో ఒక గమ్యం చేరుకోవాలన్న ఆత్రంతో అడుగులేస్తున్నట్టు - ఆ నడక తీరే చెబుతుంది

వాళ్ళ అవస్థకు జాలి కలిగింది వెంకటేశానికి నెమ్మదిగా బండి మలిపి వారి పక్కగా తీసుకెళ్ళాడు బండి దగ్గరకు రావటం చూసి (న) ముసలమ్మ ముడతలుబడ్డ మోము విప్పారింది ఆనందంతో

"ఏ వూరెళ్ళాలేంటి?" కోరమీసాల్ని అడిగాడు

"నవటపాడు" చెప్పేడు

"ఎవరన్న సుట్టాలింటికా?" తిరిగి కోరమీసాల్నే అడిగాడు

"హాఁ వూ" లేదన్నట్టు తల అడ్డంగా ఆడించాడు

"మీ దే వూరూ?" కుతూహలంగా అడిగాడు కోరమీసాలు, వెంకటేశాన్ని.

"నవటపాడే" చెప్పాడు

"మరెందుకొస్తున్నట్టూ?" ఆసక్తిగా అడిగాడు వెంకటేశం

"బతుకుతెరువుకోసవూఁ" అన్నాడు.

"సర్ సరే! ముందు బండెక్కండి," అన్నాడు తర్వాత మాట్లాడుకోవచ్చని.

ముగ్గురూ బండెక్కారు ముసలమ్మ కామా ఫుల్‌స్టాప్ లేకుండా వెంకటేశాన్ని దీవించింది. మొహమాటపడిపోయాడు.

"ఈ పిల్లేం కావాలి? ముసలమ్మను అడిగాడు

"ఈమె మా చెల్లెలు కనకదుర్గ అమ్మ సూరమ్మ" తనే కల్పించుకొని అన్నాడు కోరమీసాలు

"ఇంతకీ నీ పేరేంటో సెప్పనేదు" వెంకటేశ మన్నాడు

నాలుక్కర్చుకున్నాడు కోరమీసాలు, ఇంతసేపు తనపేరు చెప్పనందుకు

"యీరయ్యా" సిగ్గుపడుతూ చెప్పాడు

"నీ పేరేంటో సెప్పనేలేదూఁ" ఇంత సేపూ మమ్మల్నే అడిగావు అన్నట్టు మొహంపెట్టి ఆడిగాడు వీరయ్య

"ఓస్ భలేవాడివయ్యా!" అని తన పేరు చెప్పి "ఇంతకీ మీ సొంతూరు ఏదో సెప్ప నేఁ దూ" అన్నాడు వెంకటేశం

"వెంగన్నగూడెం" అని తనూరి తాలూకా, జిల్లా కూడ చెప్పాడు

"ఇది నీ సొంత బండా ?"

సూరమ్మ ప్రశ్నకు ఉలికిపడి "మా దొర బండి" అన్నాడు

వెంకటేశం జవాబుకు సూరమ్మ మొహంలో బెదురు తాండవమాడింది కనకదుర్గ, వీరయ్య బెబ్బులివాత పడ బోతున్నట్టు వొణికారు

"దొర నిన్నేం అనడా ?" మూడు గొంతులు ఒకేసారి పలికాయి

"ఎందుకు ?" అర్థంకాక ఎదురు ప్రశ్నవేశాడు వెంకటేశం

" బండెక్కినందుకు" వీరయ్య అనుమానం వెలిబుచ్చాడు

"ఏం పర్లెదూఁ వూరు బయట దిగుదురుగాని" అభయమిచ్చాడు

అయినా ముగ్గురి మనసుల్లోని అదురు పూర్తిగా వదలలేదు

"దొర వూరి కెళ్ళేడు రేపుగానీ రాడు" పూర్తిగా వారి భయం పొగొట్టె ప్రయత్నం చేశాడు వెంకటేశం

వూరు దగ్గరవుతుంటే హఠాత్తుగా ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా" మీకు పొలం పుట్రా ఏంలేదా?" అన్నాడు సూరమ్మతో

కాల్వలులేక ఎంతోమంది పొలం మీద అధారపడేవారు, పొట్ట గడవడం కోసం స్వంత ఊర్లు వదిలి కూలికోసం వచ్చి, వర్షాకాలం కాగానే స్వంత భూముల్లో పంటలు పండించేందుకు పోయేవాళ్ళను చూశాడు వెంకటేశం ఆ దృష్టితోనే సూరమ్మను అడిగాడు


"ఐదెకరాలుంది" నిర్లిప్తంగా అంది సూరమ్మ

"వరి పండుద్దా?" తన అంచనా కొంచెం కరెక్టవటంతో రెండో ప్రశ్న అడిగాడు

"ఆ" అంది సూరమ్మ

"మ రిం కే ం" అబ్బురపడ్డాడు వెంకటేశం

"గవరమెంటోరు ఐదెకరాలకు పట్టా యిచ్చారు - లేనోళ్ళమని ఆ భూమిని మా వూరి దొర పదేళ్ళనుంచి పంటలు పండించుకున్నాడు యిప్పుడు పండిస్తూనే వున్నాడు ఆ భూమిలో కాలు పెడితే సంపుతా అన్నాడు అయినా భూమ్మీద కెళ్ళాం - దెబ్బలు తిన్నాం అంతటితో దొంరి వూఁకోలేదు మామీద పగ బట్టాడు ఆయన బాధలు భరించలేక




వస్తున్నాం" సూరమ్మ, వెంకటేశం ఆశ్చర్యానుమానాలను తీర్చింది.

దొంకత కదలకముందు వీరయ్యను దొర దగ్గర పనికి పెట్టాలనుకున్నాడు.

"దొర అంటేనే ఆకులా వొణికి పోతున్నారు పాపం! ఇక దొర దగ్గ రెలా పన్జేగల(డు)దు? దిక్కూ-మొక్కూ లేనోళ్ళు....పని దొరక్కుంటే కష్టం! ఎట్టాగైనా తన దరమంగా ఏదో ఒహ బ్రతుకుతెరువు సూపిస్తే, వాళ్ళ పాట్లేవో వాళ్ళు పడతారు. ప్రెసిడెంట్ గారికి నే నంటె....వీరయ్యను పనికి పెట్టుకో మంటే వినుకుంటుండొచ్చు. ఎట్టాగైన మన ప్రయతనం మేదో మంచిగా సేద్దాం! ఆ తర్వాత ఆడి దయ...." అనుకున్నాడు మనసులో.

వెంకటేశం అభిప్రాయం విన్న సూరమ్మ మహానందంగా "ఆ దేవుడే నీ రూపములో సాయం చేత్తానంటే, కావాల్సిందేముంది బిడ్డా!" అంది.

"మాకు బతుకుతెరువు సుపిత్తానంటే కాదంటామా అన్నా?" అప్యాయంగా అన్నాడు వీరయ్య.

వాళ్ళ ఆప్యాయతకి కరిగిపోయాడు వెంకటేశం. ఇంకా గట్టిగా నిర్ణయించు కున్నాడు-వారి కెలాగైనా పనిచూపించా లని.

ఊరు దగ్గరవగానే తన గుడిసె ఆనవాలు చెప్పి సరాసరి అక్కడికే రమ్మన్నాడు వాళ్ళతో, బండి దిగగానే.

బండి తిన్నగా దొర యింటికి తీసు కెళ్ళాడు. బండి విడిచి ఎడ్లను తోలుకొని

రంగనాథం ఇంటివైపు అడుగులేశాడు వెంకటేశం. తనెళ్ళిన సమయానికి రంగనాథం ఇంట్లోనే వుండటం 'వీరయ్య అదృష్టం'గానే భావించాడు. వీరయ్యను పనికి పెట్టుకునే విషయమైన అన్ని విషయాలు పూర్తిగా చర్చించి, ఆకలిగా వుంటే సరాసరి గుడిసెకు చేరాడు. గుడిసె ప్రక్కన తుమ్మచెట్టు క్రింద నీడలో, కునికిపాట్లు పడుతున్న సూరమ్మను, బస్తా మూట విప్పి వంట కోసం తిప్పలు పడుతున్న వీరయ్యను, వంట వండేందుకు పొయ్యిరాళ్ళు అమర్చలేక యాతనపడుతున్న కనక దుర్గను చూసి జాలేసింది వెంకటేశానికి.

"మనూరి ప్రెసిడెంటుగారు శానా మంచోరు. వారి దగ్గరనే నీకు పని మాట్లాడుకొచ్చాను. రేపే పన్లో కెళ్ళు! నువ్వు బుద్ధిగా పన్జేస్తే, నెమ్మదిగా నీ పనితనం చూసి జీతం పెంచుతాడులే" చెప్పాల్సిన శుభవార్త నెమ్మదిగా చెప్పాడు. తిరిగి తనే "వారి పశువుల పాకలోనే ఓ పక్క మీరుండొచ్చు" అన్నాడు వెంకటేశం గుడిసెలోకి దూరుతూ.

* * *

సూరమ్మ, కనకదుర్గ, వీరయ్యలపై వెంకటేశానికున్న జాలి స్థానాన్నే, ఏదో తెలియని ఆత్మీయత పేరుకుంది.

రోజు కొంకసారయినా తీరిక దొరికించుకుని సూరమ్మ, కనకదుర్గ, వీరయ్యలతో మాట్లాడకుండా ఉండలేక పోతున్నాడు. అలాగే వెంకటేశం రాని రోజున ఏదో వెలితిగా వుండేది సూరమ్మకు.

సాయంత్రం కాగానే ఊరిబయట చెరువుగట్టుమీద ఒకర్నొకరు కల్సుకోకుండా ఉండలేకపోయేవాడు వీరయ్య. చెరువుగట్టు వారిద్దరి సంభాషణలో "పెద్దోళ్ళ" మొదలుకుని "పేదోళ్ళ" జీవితాలవరకు దొర్లేవి.

"అన్నా" అని గుండెనిండుగా ఆత్మీయత కనపర్చే వీరయ్య, వెంకటేశానికి మరీ దగ్గరయ్యాడు.

ఎవరికోసమూ ఆగని కాలం నడుస్తూనేవుంది. వెంకటేశం సహాయ సహకారాలతోనే కనకదుర్గ పెళ్ళి చేశారు సూరమ్మ, వీరయ్యలు.

పెరిగేది విరుగుటకొరకే అనేనానుడి అబద్ధమనిపించేలా పెనవేసుకపోయింది వెంకటేశం అనుబంధం, వీరయ్య సూరమ్మలతో.

వారాలు గడిచాయి - నెలలు గడిచిపోయాయి. సంవత్సరాలు మంచు ముద్దల్లా కరిగిపోతున్నాయి — దొర్లిపోతున్నాయి. అయినా వీరయ్య - వెంకటేశంల మధ్య అనుబంధం పెరుగుతూనేవుంది తప్ప వారిద్దరి మధ్య మరే మార్పులేదు.

ఉన్న మార్పు మాత్రం ఊళ్ళోనే. అంటే ఊళ్ళో ఉన్న జనంలో కాదు.

రంగనాధం దొరలమధ్యనే సరికొత్త మార్పు పుట్టింది - కాదు పుట్టించుకున్నారు. దొర యిచ్చిన ఐదెకరాల భూమి పుట్టించిన రంగనాధం యాభై ఎకరాల భూమి నూటయాభై ఎకరాలుగా మారింది. దొర మాటల్లో చెప్పాలంటే, కాదు రంగనాధం 'మార్చుకున్నాడు' అని చెప్పాలి.

దొర కిది నచ్చలేదు. ఒకప్పుడు తన కాళ్ళందుకోలేనివాడు, తన జుట్టు అందుకునేలా ఎదిగిపోవటం పుండు మీద కారం చల్లినట్టయింది.

యిహ వాజమ్మలా చేతులుముడుచుకు కూర్చుంటే 'నామోషి' అన్పించింది. ఊరంతటికి తన ప్రతాపం చూపించాలనుకున్నాడు - ముఖ్యంగా రంగనాధానికి.

ఎన్నికల్లో రంగానాధాన్ని బలపర్చ తల్చుకోలేదు దొర. కచ్చితంగా రంగనాధాన్ని బలపర్చటంలేదని "ఇందేంటీ, భుజాలు రాసుకుంటూ తిరిగినోళ్ళు యిలా అయిపోయారేంటి?! తమాషాగా వుందే...." అని విస్తుపోతున్న వారికి- ఓటు హక్కున్న ప్రతివాణ్ణి సమావేశపర్చి మరీ చెపుతున్నాడు.

దొర విజృంభించాడు అన్నారంత.

పోటీ ప్రధానంగా ఇద్దరిమధ్యే సాగుతుంది.

అదీ - రంగనాధం - రామానాయుడు వురఫ్ దొరలమధ్యనే.

ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతుంది

వూరంతా ఘాటయిన వాసనతో నిండిపోయింది.

అసలు ఓటుహక్కున్న ప్రతివాడూ ఘాటుగానే వున్నాడు.

దొర పశువులపాక తెల్ల ప్లాస్టిక్ పీపాలతో నిండిపోయింది.

రంగనాధం కూడ దొర "స్థాయి"నే వున్నాడు.

పోలింగ్ రేపే.

ఈ రాత్రి తెల్లవారితే, రేపు....

దొర తనవారినంతా ఆ రాత్రే పిలిపించాడు. వారంతా "ఈ అమావాస్య కటిక చీకటిలో తమతో పనేంకలిగి దబ్బా!!" అని అనుకోలేదు - వారలా ఆలోచించే స్థితిలో లేరసలు.

అంత చీకటిలోనూ పాకలో వారికి ముక్కుపుటాలు అదిరే వాసనేస్తుంది. పశువుల మలమూత్రాల వాసనకాదు.

పిల్లిలా నడుచుకుంటూ దొర రానే వచ్చాడు.

మీ కోసమే ఎదురుచూస్తున్నామన్నట్టున్నాయి - పాకలోని మొఖాలు.

అందులో 'ఒక'డికి ప్రత్యేకంగా ఏదో చెబుతున్నాడు.

మిగతావారు దొర మాటలు వినాలని ప్రయత్నించారు. కాని దోమల పాశ్చాత్య సంగీతం వారిని విననీయ లేదు.

ఇక చెప్పాల్సిందేమి లేనట్టు గేటు తీసుకుని వచ్చినదారినే చీకట్లో కలిశాడు దొర.

ఆ 'ఒక'డు ఏదో చెప్పాడు మిగతా వారికి.

తలోరకంగా పెదాలు కదిలించారు.

ప్రత్యుత్తరంగా "ఒక"డి పెదాలు పావుగంట కదిలాయి.

మిగతావారికి సంతృప్తి కలిగింది అంతే!

గొర్రె మందలా "ఒక"డి వెంట మిగతావారు గొడ్డళ్ళు, బరిసెలతో కదిలారు.

దారి తెలిసినవాళ్లలా చీకట్లో చకచకా నడుస్తున్నారంతా. సరాసరి రంగనాధం ఇంటిని సమీపించి, గేటు తోసుకుని లోనికి వెళ్ళారు అంతాకలిసి. రంగనాధం ఊళ్ళోలేడు - కానీ తన జాగ్రత్తలో తనున్నాడు. రంగనాధం ఇంటికప్పు ఎగిరిపోయేలా హహకారాలు మిన్ను ముట్టాయి. ఊరంతా గాఢనిద్రలోవుంది-మత్తు ముసుగులోవుంది

ఆర్తనాదాలు చెలరేగాయి.

తెల్లవారింది.

రంగనాధం ముందుజాగ్రత్తకోసం తెచ్చుకున్న వారిని, దొరికినంత మటుకు, అందులో వీరయ్యతోసహా ఒక వ్యాన్‌లో ఎక్కించబడి ఉన్నారు. మరో వ్యాన్‌లో దొర ముఠా దొరికినంతవరకు ఎక్కించబడి ఉన్నారు. వ్యానులో వున్న దొర ముఠాలో వెంకటేశం లేడు.

దొర ముఠాకు నాయకత్వం వహించిన "ఒక"డికీ, వెంకటేశానికీ కాదు రెండు శవాలను మూడవ వ్యాను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు పోలీసువారు.

సూర్యుడు తూర్పున ఉదయించాడు.

పశువులు మేతకు పోతున్నాయి.

హఠాత్తుగా పశువుల మందలో సంచలనం కలిగింది.

రెండు ఆంబోతులు హోరాహోరీగా కుమ్ముకుంటున్నాయి.

పశువుల మంద సురక్షిత స్థలానికి పరిగెడుతూనేవుంది - ఆంబోతుల పోట్లాటకు బయపడి. లేగలకు దిక్కు తోచలేదు. అప్పటికప్పుడే ఓ లేగదూడ ఆంబోతుల కుమ్ములాటలో ఆహూతి అయింది.

